క్లుప్తంగా

ఉద్యాన పంటలతో మహిళలకు అదనపు లబ్ధి

గరుగుబిల్లి: ఉద్యానవన పంటలతో మహిళలకు అదనపు లబ్ధి చేకూరుతుందని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అన్నారు. మండలంలోని ఉల్లిభద్రలో ఉన్న ఉద్యానవన కళాశాల దగ్గర డ్వామా ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన కొబ్బరి మొక్కలు నాటే కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై, పలు కొబ్బరి మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో భాగంగా చెరువు గట్లు, ఖాళీ స్థలాల్లో ఉద్యాన పంటలు వేసుకోవచ్చన్నారు. 2025–26 ఆర్థిక సంవత్సరంలో 500 హెక్టార్లలో కొబ్బరి మొక్కలు వేసేందుకు లక్ష్యంగా నిర్ణయించడం జరిగిందన్నారు. కొబ్బరితో పాటు ఇతర పండ్లతోటల మొక్కలు వేసుకోవడం ద్వారా అధిక ఆదాయం పొందవచ్చన్నారు. మహిళలు కోరుకున్న ఉద్యాన మొక్కలను ఉచితంగా అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డ్వామా పీడీ కె.రామచంద్రరావు, వైఎస్సార్ ఉద్యానవన కళాశాల అసోసియేట్ డీన్ ఆర్.రాజేశ్వరి, ఎంపీడీవో జి.పైడితల్లి పాల్గొన్నారు.

ఉపాధిలో పండ్ల తోటల పెంపకం

సీతంపేట: ఉపాధిలో పండ్ల తోటల పెంపకానికి చర్యలు తీసుకుంటున్నట్టు ఐటీడీఏ పీవో సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి అన్నారు. మండలంలోని హడ్డుబంగిలో కొబ్బరి మొక్కలు నాటే కార్యక్రమాన్ని మంగళవారం చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని 526 ఎకరాల్లో ఉపాధి పథకంలో కొబ్బరి, జీడి, సపోటా, నిమ్మ, సీతాఫలం చెట్లను నాటడం జరుగుతుందన్నారు. రైతులు వీటిని సాగు చేయాలన్నారు. కార్యక్రమంలో ఉపాధి ఏపీడీ శ్రీహరి, ఏపీవో సాగర్ తదితరులు పాల్గొన్నారు.

వసతిగృహాల్లో మౌలిక సదుపాయాలు కల్పించండి

పాలకొండ రూరల్: వసతిగృహాల్లో విద్యార్థులకు పూర్తి స్థాయి మౌలిక సదుపాయాలు కల్పించాలని జిల్లా బీసీ, ఎస్సీ సంక్షేమ సాధికారిత (ఎఫ్ఏసీ) అధికారి ఇ.అప్పన్న అన్నారు. పట్టణ పరిధిలోని నాలుగు బీసీ, ఎస్సీ సంక్షేమ వసతిగృహాలను ఆయన మంగళవారం సందర్శించారు. ఎస్సీ ప్రీ మెట్రిక్ బాలుర వసతిగృహంలో 12 మంది విద్యార్థులు ఉండడాన్ని గుర్తించి సంక్షేమాధికారిని మందలించారు. ఆయన వెంట సాంఘిక సంక్షేమ శాఖ సహాయ అధికారిణి పీఎస్ స్వర్ణమణి, వసతిగృహాల సంక్షేమాధికారులు ఉన్నారు.

గడువులోగా పంటల బీమా చెల్లించాలి

గరుగుబిల్లి: నిర్ణీత గడువులోగా పంటల బీమా చెల్లించాలని ఏవో టి.జ్యోత్స్న రైతులకు సూచించారు. మండలంలోని కొత్తపల్లి గ్రామ రామమందిరం వద్ద పొలంబడి కార్యక్రమం మంగళవారం నిర్వహించి, రైతులతో సమావేశమయ్యారు. ఆమె మాట్లాడుతూ ఖరీఫ్ పనులు ప్రారంభమవుతున్నందున రైతులంతా జూలై 15వ తేదీలోగా అరటి, ప్రత్తి పంటల బీమాకు సంబంధించి, పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. ఆగస్టు 15వ తేదీలోగా వరి పంట బీమా చేయించుకోవాలన్నారు. కౌలురైతులు కూడా తమ పేరున కౌలుకార్డులను పొంది ప్రభుత్వ రాయితీలు, పంట రుణాలు పొందాలన్నారు. వరిఉభాలు పూర్తయిన తర్వాత గట్లుపై కందుల పంట వేసుకోవాలన్నారు. కందులు పండించడం వల్ల పంటలను ఆశించే పురుగులు నియంత్రించడంతో పాటు అదనపు ఆదాయం పొందేందుకు అవకాశం ఉంటుందన్నారు.

కిరాణా షాపుల్లో ఆకస్మిక తనిఖీలు

కొమరాడ: స్థానిక జూనియర్ కళాశాల, పాఠశాల ప్రాంగణం నుంచి 100 మీటర్ల లోపు ప్రాంతంలో పొగాకుతో కూడిన నిషేధిత వస్తువులు ఏవైనా అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ కె.నీలకంఠం హెచ్చరించారు. కళాశాల జంక్షన్ వద్ద కిరాణా షాపుల్లో ఆయన మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పొగాకు ఉత్పత్తులను విద్యాసంస్థల దగ్గరలో విక్రయించరాదని, ఎవరైనా విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు.

మలేరియా నిర్ధారణ పరీక్షలు చేయాలి

గుమ్మలక్ష్మీపురం: మలేరియా నిర్ధారణ పరీక్షలు చేయాలని జిల్లా ఉప వైద్యాధికారి కేవీఎస్ పద్మావతి సూచించారు. మండలంలోని దుడ్డుఖల్లు, రేగిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆమె మంగళవారం సందర్శించారు. రికార్డుల నిర్వహణ, సిబ్బంది పనితీరు, మందుల నిల్వలను పరిశీలించి, పలు సూచనలు చేశారు. ఆస్పత్రికి వస్తున్న రోగులకు సకాలంలో మెరుగైన వైద్యం అందివ్వాలని, అలాగే మలేరియా నిర్ధారణ అయిన వారికి మందులు అందిస్తూనే వారి ఆరోగ్యంపై రోజూ ఆరాతీయాలన్నారు.



రేగిడి పీహెచ్‌సీ వైద్య సిబ్బందికి సూచనలిస్తున్న జిల్లా ఉప వైద్యాధికారి పద్మావతి



జియ్యమ్మవలస రూరల్: పెదమేరంగిలో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు పరీక్షిత్‌రాజు తదితరులు



గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాంలో కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు



గుమ్మలక్ష్మీపురంలో వైఎస్సార్ విగ్రహం వద్ద కేకు కట్ చేస్తున్న నాయకులు

వైఎస్సార్ ఆశయ సాధనకు పాటుపడదాం

దివంగత ముఖ్యమంత్రి, మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశయ సాధనకు అంతా కలిసి ఐక్యంగా పని చేద్దామని మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, మన్యం జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజుతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. వైఎస్సార్ జయంతి సందర్భంగా గ్రామ గ్రామాన ఆయన విగ్రహాలకు క్షీరాభిషేకాలు చేశారు. పూలమాలలు వేసి పార్టీ అభిమానులు, శ్రేణులు, ప్రజలు ఘనంగా నివాళులర్పించారు. ఆయన ఆశయం కోసం ఐక్యంగా పని చేసి మళ్లీ వైఎస్సార్‌సీపీని అధికారంలోకి తీసుకురావాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ప్రతిన బూనారు. ఆయా కార్యక్రమాల్లో పార్టీ శ్రేణులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. – సాక్షి నెట్‌వర్క్



సీతంపేట: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కళావతి తదితరులు



గరుగుబిల్లి: ఖడ్గవలస జంక్షన్‌లోని వైఎస్సార్ విగ్రహం వద్ద జోహార్ వైఎస్సార్ అని నినాదాలు చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు



భామిని: కొరమలో వైఎస్సార్ విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న కార్యకర్తలు



కొమరాడ: రాజ్యలక్ష్మీపురంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ జిల్లా యూత్ అధ్యక్షుడు నంగిరెడ్డి, తదితరులు



కొమరాడలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న పార్టీ నాయకులు, కార్యకర్తలు

విద్యార్థి దశలోనే నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి

వీరఘట్టం: విద్యార్థి దశలోనే ప్రతీ ఒక్కరు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని బిటివాడ జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం సీహెచ్ రత్నాకరరావు అన్నారు. సాంఘిక శాస్త్రం బోధనలో భాగంగా విద్యార్థులకు నమూనా గ్రామ పంచాయతీ ఎన్నికలను మంగళవారం నిర్వహించారు. పంచాయతీ ఎన్నికల మాదిరిగానే బ్యాలెట్ పేపర్‌ను ముద్రించారు. ఈ బ్యాలెట్ పై అభ్యర్థులను ఎలా ఎన్నుకోవాలో, ఓటు వేయడానికి వచ్చే వారికి ఓటు ఎలా వేయాలో చెప్పడం, వారి చూపుడు వేలికి సిరా గుర్తు వేయడం తదితర అంశాలను సోషల్ టీచర్ వివరించారు.



ఓటు వేసేందుకు క్యూలో ఉన్న బాలికలు

సర్వే పరిశీలన

గరుగుబిల్లి: మండలంలోని ఉల్లిభద్రలో అసంక్రామిక వ్యాధుల సర్వేను రిమ్స్ వైద్య కళాశాల ఎస్పీఎం విభాగం వైద్య బృందం పరిశీలించడం జరుగుతోందని జిల్లా ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావు తెలిపారు. ఈ మేరకు వైద్య బృందం గ్రామంలో చేపడుతున్న సర్వేను ఆయన మంగళవారం పర్యవేక్షించారు. రిమ్స్ వైద్య కళాశాల ప్రొఫెసర్ పి.మనోజ్ తన బృందంతో కలిసి ఉల్లిభద్రలో జరిగిన సర్వే నైపుణ్యత, ప్రమాణాలను పరిశీలించినానంతరం ఆయన మాట్లాడారు. గ్రామంలో పలువురికి అసంక్రామిక వ్యాధుల నిర్ధారణ పరీక్షలు నిర్వహించి ఆ నివేదికలను వైద్య బృందం పరిశీలించినట్లు పేర్కొన్నారు. గ్రామంలో మూడు రోజుల వరకు సర్వే పరిశీలిస్తారని తెలిపారు. అనంతరం గరుగుబిల్లి పీహెచ్‌సీలో జరిగిన ఆశ డే కార్యక్రమంలో ఆయన పాల్గొని గ్రామాల్లో అందుతున్న వైద్యసేవలపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.



సర్వేను పరిశీలిస్తున్న జిల్లా ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి జగన్‌మోహన్‌రావు

పేదలపై కూటమి నేతల దాడులు ఆపాలి

– మాజీ ఎమ్మెల్యే కళావతి డిమాండ్

భామిని: కూటమి పాలనలో ప్రజలపై దాడులు చేసి భయాందోళనకు గురి చేయడం ఆనవాయితీగా పెట్టుకొన్నారని పాలకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. ఘనసర వద్ద ఆక్రమణల తొలగింపు బాధితులను మంగళవారం ఆమె కలిసి మాట్లాడారు. పేదలు ఇళ్లు కట్టుకొని జీవిస్తున్న చోట ఆక్రమాలు పేరిట తొలగింపు చర్యలకు పూనుకొనడం సరికాదన్నారు. ఇళ్లు లేని పేదలందరికీ ఇంటి స్థలాలను కేటాయించి పక్కాగృహాలు నిర్మించి ఆక్రమణలు తొలగించాలని డిమాండ్ చేశారు. అధికారులు ఆలోచించి ఏబీ రోడ్డుకు ఇరువైపుల ఆక్రమణలు తొలగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. చిన్నదిమిలిలో వైస్ ఎంపీపీ బోనగడ్డి ధర్మారావును పరామర్శించారు. కార్యకర్తలతో మాట్లాడారు. పసుకుడి ఉప సర్పంచ్ నరిసింహ గౌడ్ కుటుంబాన్ని కలిశారు.



ఘనసరలో పేదలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కళావతి

పేదరిక నిర్మూలనకు చర్యలు

భామిని: పేదరిక నిర్మూలన పథకాలపై అధికారులు కార్యదర్శులకు వివరించారు. మండల పరిషత్ కార్యాలయంలో జిల్లా పంచాయతీ అధికారి కొండలరావు కార్యదర్శులతో మంగళవారం సమావేశమయ్యారు. ఎంపీడీవో, డిప్యూటీ ఎంపీడీవోలు సమావేశంలో పేదరిక నిర్మూలన పథకాలను వివరించారు. ఇటీవల చేపట్టిన పీ 4 సర్వేలో గుర్తించిన బంగారు కుటుంబాల అనుసంధానంపై వివరించారు. కార్యదర్శులు పాల్గొన్నారు.



సమావేశంలో వివరిస్తున్న డీపీవో కొండలరావు

నిబంధనలు అతిక్రమిస్తే కేసులు: డీఎస్పీ

పాలకొండ రూరల్: విద్యా సంస్థల ప్రాంగణాల్లో, పరిసర ప్రాంతాల్లో పాన్, కిరాణా షాపులు నిర్వహించే వారు నిషేధిత పదార్థాల అమ్మకాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పాలకొండ డీఎస్పీ ఎం.రాంబాబు హెచ్చరించారు. మంగళవారం తన సిబ్బందితో కలసి పలు విద్యా సంస్థలు, పాఠశాలలు, కళాశాలల పరిసరాల్లో తినుబండారాలకు సంబంధించిన దుకాణాలపై మంగళవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. వారు అమ్ముతున్న వస్తువుల బ్రాండ్, నాణ్యతా, వినియోగ సమయం, ప్రమాణాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఆపరేషన్ సేఫ్ క్యాంపస్ పేరిట ఇకపై ఈ తరహా తనిఖీలు జరుగుతాయన్నారు. ఆయన వెంట ఎస్ఐ కె.ప్రయోగమూర్తి, క్రైమ్ సిబ్బంది ఉన్నారు.

నేటి సమ్మెకు ఈయూ మద్దతు

పాలకొండ రూరల్: దేశ వ్యాప్తంగా బుధవారం ట్రేడ్ యూనియన్లు తలపెట్టిన సార్వత్రిక సమ్మెకు ఏపీపీటీడీ (ఆర్టీసీ) ఎంప్లాయిస్ యూనియన్ మద్దతు ఇస్తున్నట్టు ఆ సంఘం విజయనగరం జోనల్ ఇంచార్జ్ బాసూరు కృష్ణమూర్తి తెలిపారు. మంగళవారం పాలకొండ కార్యాలయంలో ఈ మేరకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమ్మెలో భాగంగా జోన్ పరిధిలో గల 19 డిపోల్లో, గ్యారేజీల్లో విధులు నిర్వహిస్తున్న తమ ఉద్యోగులు ఎర్ర బ్యాడ్జీలతో సంఘీభావం తెలుపుతారన్నారు. స్థానికంగా ట్రేడ్ యూనియన్లు నిర్వహించే అన్ని నిరసన కార్యక్రమాల్లో పాల్గొనున్నట్టు స్పష్టం చేశారు. సమావేశంలో సంఘం కోశాధికారి జి.తాతలు, వై.రాము, యుఎస్.నారాయణ, డీఎస్ జనారాయణ తదితరులున్నారు.

దేశవ్యాప్త సమ్మెకు తరలిరండి

గరుగుబిల్లి: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా బుధవారం చేపడుతున్న దేశవ్యాప్త సమ్మెకు కార్మికవర్గమంతా తరలిరావాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బీవీ రమణ కోరారు. ఇదే విషయమై ఆయన గరుగుబిల్లి, రావుపల్లి, దళాయివలస, సుంకి ప్రాంతాల్లో మంగళవారం పర్యటించి, అక్కడి మధ్యాహ్న భోజన నిర్వాహకులు, రైస్ మిల్లు కలాసీలు, గ్రీన్‌అంబాసిడర్లు, ఆశ కార్యకర్తలను కలిసి సమ్మెపై చర్చించారు. ఆయన మాట్లాడుతూ కార్మికరంగానికి నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్‌ల రద్దుతో పాటు రూ.20 వేల కనీస వేతనం, 8 గంటల పనిదినం, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, ఆశ, అంగన్‌వాడీ తదితర స్కీం వర్కర్ల సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యాలుగా చేస్తున్న ఈ సమ్మెకు హాజరై, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ

వీరఘట్టం: పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటాలని పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ పిలుపునిచ్చారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని నడిమికెల్ల గ్రామ పంచాయతీలో మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. నాటిన మొక్కను సంరక్షించాలని అప్పుడే మన లక్ష్యం నెరవేరుతుందని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో బి.వెంకటరమణ, ఏపీవో జి.సత్యం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల కోసం ర్యాలీ

పాలకొండ: పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరుతూ పట్టణంలో సీపీఐ ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకుడు బుడితి అప్పలనాయుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు పట్టణంలో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే వెలసిన కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలని కోరారు. గిరిజనులకు ఉచిత విద్యుత్ అందించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు కోరంగి మన్మధరావు, కోరంగి గోపీనాయుడు, గురుబుబిల్లి సూర్యనారాయణ, యుగంధర్, లింగరాజు, ద్వారపూడి అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ చేస్తున్న సీపీఐ నాయకులు

నిఘా పెంచండి

కొమరాడ: పార్వతీపురం నుంచి కూనేరు వయా రాయగడ వెళ్లే అంతర్‌రాష్ట్ర రహదారిలో మాదక ద్రవ్యాల రవాణా జరగకుండా నిఘా పెంచాలని ఏఎస్పీ అంకితా సురానా సూచించారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను ఆమె మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేసి, రికార్డుల నిర్వహణ, సిబ్బంది పనితీరును పరిశీలించారు. అనంతరం కూనేరు చెక్ పోస్టు పరిశీలించి, గంజాయి, సారా, అక్రమ మద్యం తరలింపులు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సిబ్బందికి తెలిపారు. ఎప్పటికప్పుడు వాహన తనిఖీలు నిర్వహించాలన్నారు. ఆమె వెంట ఎస్ఐ కె.నీలకంఠం తదితరులు పాల్గొన్నారు.



కూనేరు చెక్‌పోస్టు వద్ద రికార్డులు పరిశీలిస్తున్న ఏఎస్పీ అంకితా సురానా

అప్రమత్తంగా ఉండాలి

జియ్యమ్మవలస రూరల్: వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఎక్కువగా ఉన్నందున అందరూ అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో ఎస్.భాస్కరరావు సూచించారు. ఆశ డే సందర్భంగా మండలంలోని రావాడ–రామభద్రపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన మంగళవారం సందర్శించారు. అనంతరం సిబ్బందితో సమావేశమై గిరిజన గ్రామాల నుంచి వస్తున్న పేషెంట్లకు మెరుగైన వైద్యం అందించాలని తెలిపారు. గర్భిణులు, బాలింతలు, కిశోరి బాలికలంతా రక్తహీనత బారినపడకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి సీహెచ్ శంకరరావు తదితరులు పాల్గొన్నారు.



ఆశ కార్యకర్తలకు సూచనలిస్తున్న డీఎంహెచ్‌వో భాస్కరరావు

గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయండి

గరుగుబిల్లి: గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి ఎంపీడీవో జి.పైడితల్లి సూచించారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ పురోగతి సూచికపై శిక్షణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ పథకం కింద గ్రామాల అభివృద్ధికి అవసరమైన ప్రణాళికలు తయారు చేయాలన్నారు. ఏ గ్రామంలోనూ తాగునీటి సమస్య లేకుండా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో ఎల్.గోపాలరావు, ఏవో ఎస్.అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో పైడితల్లి



ఆశ్రమ పాఠశాలను సందర్శించిన పీవో

సీతంపేట మండలంలో బుడగరాయి గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలను ఐటీడీఏ పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి మంగళవారం సందర్శించారు. విద్యార్థుల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. మెనూ సక్రమంగా అమలు చేయాలన్నారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. వసతిగృహ, తరగతి గదులను పరిశీలించారు. - సీతంపేట



ఆటో కార్మికుల ర్యాలీ

దేశ వ్యాప్త సమ్మెకు మద్దతుగా పాలకొండ పట్టణంలో ఆటో కార్మికులు మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. బుధవారం చేపడుతున్న సమ్మెకు అన్ని వర్గాల ప్రజల మద్దతు అందించాలని నినదించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు దావాల రమణారావు, ఆటో యూనియన్ నాయకులు కాద రాము, దూసి దుర్గారావు, పి.శేఖర్, పి.రాము, జి.గోవిందరావు తదితరులు పాల్గొన్నారు. - పాలకొండ